AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

16-10-2026 (Friday)

MAIN EDITION

అమెరికాలో స్కూల్‌పై కాల్పులు..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం బెండ్ నగరంలోని సిల్వర్ రైల్ ఎలిమెంటరీ స్కూల్‌లో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. 16 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చిన్నారులు, ఓ ఉపాధ్యాయుడు ప్రాణాలు కోల్పోయారు. మరో చిన్నారి, ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాల్పులకు తెగబడిన నిందితుడిని అక్కడున్న ఓ వ్యక్తి వెంబడించి కాల్చడంతో అతడు మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

స్టార్‌లింక్‌పై రిలయన్స్ కీలక వ్యాఖ్యలు

అక్షరటుడే, నేషనల్ డెస్క్: బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ స్టార్‌లింక్, భారత టెలికాం రంగం మధ్య శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులపై చర్చలు నడుస్తున్న వేళ రిలయన్స్ జియో స్పందించింది. స్టార్‌లింక్ సహా ఏ విదేశీ కంపెనీ నుంచైనా వచ్చే పోటీని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని రిలయన్స్ స్పష్టం చేసింది. అయితే భారత మార్కెట్‌లో వ్యాపారం చేయాలనుకునే ఏ సంస్థయినా ఇక్కడి చట్టాలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తేల్చిచెప్పింది. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో రిలయన్స్ ఈ అంశంపై అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. తాము ఎన్నడూ పోటీకి వెనకాడలేదని, ఆరోగ్యకరమైన పోటీ ఎల్లప్పుడూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా చేస్తుందని పేర్కొంది.

వరల్డ్ పవర్ లిఫ్టింగ్‌లో భారతీయుడి సత్తా



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికాలో జరిగిన ప్రతిష్టాత్మక వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణకు చెందిన 74 ఏళ్ల సీనియర్ అథ్లెట్ డివి శంకర్ రావు అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించారు. జాతీయ స్థాయిలో ఇప్పటికే సత్తా చాటిన ఆయన.. తాజాగా అంతర్జాతీయ వేదికపై దేశ కీర్తిపతాకాన్ని ఎగురవేశారు.

విండ్‌ఫాల్ ట్యాక్స్ మార్పులు..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఇంధన ఎగుమతులపై విధించే 'విండ్‌ఫాల్ ట్యాక్స్' అంటే అదనపు లాభాల పన్నును సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త నిబంధనల ప్రకారం.. విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్‌పై లీటరుకు రూ.16గా ఉన్న రుసుమును రూ.8.50కి తగ్గించారు.

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనం ప్రారంభం



అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనం, బ్లడ్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రారంభించారు. ప్రజలకు రక్తదాన సేవలు, ఇతర సామాజిక సేవలను అందించడంలో ఈ కేంద్రం కీలకంగా మారనుంది.

హైదరాబాద్‌లో 'ఆపరేషన్ కవచ్'..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: నగరంలో అక్రమ కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు 'ఆపరేషన్ కవచ్' నిర్వహించారు. చార్మినార్ జోన్ పరిధిలోని 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్టోబర్ 16న తెల్లవారుజామున ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో 500 మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పరిశీలించారు. అలాగే అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణాలు మూసివేసేలా పర్యవేక్షణ చేపట్టినట్లు చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే తెలిపారు.

బార్ లైసెన్సులకు భారీ పోటీ..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: హైదరాబాద్‌లోని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో బార్ లైసెన్సుల కోసం భారీ పోటీ నెలకొంది. కేవలం 14 బార్లకు ఏకంగా 4,251 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్కో బార్‌కు సగటున 304 దరఖాస్తులు వచ్చినట్లు లెక్క. శుక్రవారం నార్సింగిలో ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. ఇక తెలంగాణవ్యాప్తంగా 41 బార్ల కోసం మొత్తం 8,770 దరఖాస్తులు అందాయి. మిగిలిన 27 బార్లకు వచ్చిన 4,519 దరఖాస్తులపై ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో లాటరీలు నిర్వహించారు.

లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశీయ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, లోహ రంగాలకు మదుపర్ల నుంచి మద్దతు లభించడంతో ఆ రంగాల షేర్లు రాణించాయి. దీంతో సెన్సెక్స్ 413 పాయింట్ల లాభంతో ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 74,314 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 74,778 గరిష్ఠ స్థాయికి చేరింది. చివరకు 413 పాయింట్ల లాభంతో 74,729 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148 పాయింట్లు లాభపడి.. 23,146 వద్ద ట్రేడింగ్‌ను ముగించింది.



డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు!

■ త్వరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ? ■ సరిపోని ఎన్డీయే బలం.. ■ ఇతర పార్టీలతో సంప్రదింపులు

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదం కోసం బీజేపీ మరోసారి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్య బలం కూడగట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు త్వరలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

– అక్షరటుడే, ఢిల్లీ

బడ్జెట్ సమావేశాల సమయంలో కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను తీసుకొచ్చింది. అయితే సరైనా సంఖ్య బలం లేకపోవడంతో లోక్‌సభలో ఆ బిల్లు ఆమోదం పొందలేదు. దీంతో మరోసారి ఈ బిల్లులను సభలో ప్రవేశ పెట్టాలని కేంద్రం భావిస్తోంది. సభలో తమకు తగినంత సంఖ్యాబలం ఉందని ప్రభుత్వం ధీమాగా ఉందని, అందుకే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిసింది.

360 ఓట్లు అవసరం..

ఈ బిల్లుల ఆమోదం కోసం మొత్తం సీట్లలో సుమారు 360 మంది ఎంపీల మద్దతు అవసరం. అయితే ఎన్‌డీఏ కూటమికి సొంతంగా అంత మెజారిటీ లేదు. 20 మంది తృణమూల్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబీటీ) ఎంపీలు ఇటీవల అధికార పక్షంలో చేరారు. దీంతో ఎన్‌డీఏ బలం పెరిగింది. మరోవైపు డీఎంకేతో బీజేపీ సంప్రదింపులు జరుపుతోంది.

ఎనిమిది మంది ఎంపీలు ఉన్న ఎన్‌సీపీ (ఎస్పీ) వంటి ఇతర పార్టీల నుంచి కూడా ప్రభుత్వం మద్దతు ఆశిస్తున్నట్లు సమాచారం.

డీఎంకేతో చర్చలు

ఈ బిల్లుల ఆమోదం కోసం మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమికి అంత బలం లేదు. ఈ క్రమంలో ఇటీవల ఇండియా కూటమితో విడిపోయిన డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతోంది. ఆ పార్టీ మద్దతు కూడగట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది.

మరోవైపు టీఎంసీ రెబల్ ఎంపీలు ఎన్‌సీపీఐ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. వీరు కూడా కేంద్రానికి మద్దతు తెలిపే అవకాశం ఉంది. ఇటీవల వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగిశాయి. అయితే సభను స్పీకర్ వాయిదా వేయలేదు. దీంతో ఈ నెలాఖరులో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది.



అభిజీత్ దిప్కే నివాసానికి ఢిల్లీ పోలీసులు..

అక్షరటుడే, ఢిల్లీ: సీజేపీ చీఫ్ అభిజిత్ దిప్కే 'తిరంగా యాత్ర'కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఢిల్లీ పోలీసు బృందం ఒకటి అభిజీత్ దిప్కే ఉంటున్న నివాసానికి చేరుకుంది. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో చేపట్టాలనుకున్న 'తిరంగా యాత్ర'ను నిర్వహించవద్దని కోరుతూ నోటీసు అందజేసింది. కన్నాట్ ప్లేస్‌లో ప్రస్తుతం సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. 'తిరంగా యాత్ర' కోసం న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ నుంచి గానీ, పోలీసుల నుంచి గానీ ఎటువంటి అనుమతి పొందలేదని నోటీసులో పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉండగా.. అనుమతి లేకుండా కన్నాట్ ప్లేస్‌కు వెళ్లి యాత్రను నిర్వహిస్తే, అది సెక్షన్ 163 ఉల్లంఘన కిందకు వస్తుందని పోలీసులు తెలిపారు.

స్థానిక సమరం.. ఏపీలో ఉద్రిక్తతలు



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజే ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. అన్నమయ్య జిల్లా పుంగనూరులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసీపీ, టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడులు చేసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఎంపీ మిథున్ రెడ్డికి గాయాలయ్యాయి. దీనిని ఆయనపై జరిగిన హత్యాయత్నంగా వైఎస్సార్సీపీ పేర్కొంది. రాయచోటిలో వాహనాలు దగ్ధం రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆఫీసుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. వైసీపీ ఆఫీసుతో పాటు మాజీ ఎమ్మెల్యే వాహనాలకు నిప్పుపెట్టారు. దీంతో 10 వాహనాలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. స్థానిక ఎన్నికల సమయంలో ఏపీలో దాడులు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

జాగింగ్ చేస్తుండగా దూసుకొచ్చిన మృత్యువు



అక్షరటుడే, సూర్యాపేట : సూర్యాపేట జిల్లా లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం జాగింగ్ కోసం వెళ్లిన ముగ్గురిపైకి బొలెరో వాహనం దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. బాలెంల స్టేజి వద్ద గుర్రం సైదులు, నాగరాజు, గొల్ల జానయ్య శుక్రవారం ఉదయం జాగింగ్‌కు వెళ్లారు. జనగాం నుంచి సూర్యాపేట వైపు వస్తున్న ఓ బొలెరో వాహనం వారిని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో సైదులు అక్కడికక్కడే చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజు, జానయ్యలను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ నాగరాజు సైతం మరణించాడు. జానయ్య సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు బొలెరో డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

'ఇది ప్రభుత్వం తెచ్చిన కరువు'




అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పడిన నీటి ఎద్దడిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో ఇప్పుడు కనిపిస్తున్నది ప్రకృతి వల్ల వచ్చిన కరువు కాదని, పాలకులు సరిగ్గా వ్యవహరించకపోవడం వల్ల వచ్చిన 'చేతకాని కరువు' అని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రభుత్వం చూపించిన బాధ్యతారాహిత్యం వల్లే వందలాది టీఎంసీల ప్రాజెక్టు నీళ్లు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోయాయని సామాజిక మాధ్యమాల వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్ మొదటి వారం నుంచి ఇప్పటిదాకా దాదాపు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు, మరో 250 టీఎంసీల కృష్ణా నీళ్లు సముద్రం పాలు కావడం కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనతకు అద్దం పడుతోందని కేటీఆర్ విమర్శించారు. కన్నెపల్లి, దేవాదుల లాంటి కీలకమైన పంపింగ్ స్టేషన్లను సరైన సమయంలో నడిపి ఉంటే, ఉత్తర తెలంగాణలోని రిజర్వాయర్లు, జలాశయాలన్నీ నీటితో కళకళలాడేవని పేర్కొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: తెలంగాణలో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై టీజీ సేఫ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ 15న క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 2,480 కిలోల స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని లేదా పారవేశారు. వీటి విలువ సుమారు రూ.3.78 లక్షలుగా అంచనా వేశారు. అపరిశుభ్రమైన వంటగదులు, ఈగలు, ఎలుకల బెడద, ఆహార నిల్వాల్లో లోపాలు, భద్రతా రికార్డుల కొరతను అధికారులు గుర్తించారు. దీంతో భాగ్యలక్ష్మి స్వీట్స్ అండ్ బర్ఫీ, బాలాజీ మ్యాజిక్ మిఠాయ్, యశోద డెయిరీ సంస్థల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేశారు.

రష్యాలోని కమ్చట్కాలో భూకంపం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలో భూకంపం సంభవించిందని యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ తెలిపింది. భూమికి 140 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. భూకంపం సంభవించిన వెంటనే ఎలాంటి సునామీ హెచ్చరిక జారీ చేయలేదు. ప్రకంపనల తర్వాత ఎలాంటి ప్రమాదం లేదని యూఎస్ నేషనల్ సునామీ వార్నింగ్ సెంటర్ తెలిపింది. జపాన్ వాతావరణ సంస్థ 9.9 తీవ్రత గల భూకంపం వస్తుందని అంచనా వేస్తూ, దేశంలోని చాలా ప్రాంతాలలో బలమైన ప్రకంపనలు సంభవిస్తాయని ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. అక్కడ 6.9 తీవ్రతతో భూకంపం వచ్చింది.